సరికొత్త ఉపాధి

- ఔత్సాహికులు, రైతులకు వరం 'నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ పథకం'
- గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకంతో ఉపాధి
- భారీగా సబ్సిడీ, రుణ సదుపాయం
- 50 శాతం వరకూ సబ్సిడీ



రేగాటిపల్లి వద్ద నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం కింద నిర్మిస్తున్న గొర్రెల షెడ్

ధర్మవరం రూరల్: ఔత్సాహిక రైతులు, గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకాన్ని కేంద్రంలోని పశు సంవర్ధక, కోళ్లఫారాల శాఖ నిర్వహిస్తోంది. వాస్తవంగా ఈ పథకాన్ని 2014–15లో ప్రారంభించినా.. 2024లో విస్తృతంగా అమలు చేస్తోంది. మేకలు, గొర్రెలు, కోళ్లు, పందులు తదితర జీవాల పెంపకం, పశుగ్రాసం, దాణా తయారీ ద్వారా ఉపాధి కల్పించేందుకు ఆర్థిక తోడ్పాటు అందిస్తుంది. తద్వారా పాలు, గుడ్లు, మాంసం, ఉత్పత్తి పెంచి సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగేందుకు చర్యలు తీసుకుంటుంది. జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ పథకంపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ వీరభద్రయ్య తెలిపారు. ఈ పథకం గురించి ఆయన ఏమన్నారంటే..

- 500 గొర్రెలు, 25 పొట్టేళ్లతో యూనిట్ ఏర్పాటు చేయడం ద్వారా గొర్రెలు లేదా మేకపిల్లల ఉత్పత్తి పోషణ చేపడతారు. ప్రాజెక్ట్ విలువ రూ.కోటి అంతకు మించి ఉంటే గరిష్టంగా రూ.50 లక్షలు రాయితీ ఇస్తున్నారు. అంత కన్నా తక్కువ ఉంటే ప్రాజెక్ట్ విలువలో 50 శాతం రాయితీ మంజూరు చేస్తారు.
- కోళ్ల అభివృద్ధి పథకంలో భాగంగా తక్కువ వ్యయంతో సాయం అందిస్తారు. 1000 కోడి పెట్టలు, 100 కోడి పుంజులతో పెరటి కోళ్ల యూనిట్ ఉంటుంది. కోడి పిల్లల ఉత్పత్తి, పొదుగు కోళ్ల కోసం రూ.50 లక్షల వరకు రాయితీ మంజూరు చేస్తారు. అంత కన్నా తక్కువ ఉంటే గరిష్టంగా రూ.25 లక్షలు రాయితీ మంజూరు చేస్తారు. అంతకన్నా తక్కువ ఉంటే ప్రాజెక్ట్ విలువలో 50 శాతం రాయితీ ఇస్తారు.
- పశుగ్రాసం దాణా అభివృద్ధి పథకంలో సైలేజీ తయారీ, పశుగ్రాస దిమ్మెల తయారీ, సమీకృత దాణా తయారీ యూనిట్లకు ఆర్థికసాయం అందజేస్తారు. యూనిట్ విలువ రూ.కోటి అంతకు మించి ఉంటే గరిష్టంగా రూ.50 లక్షలు రాయితీ ఇస్తారు. అంతకంటే తక్కువ ఉంటే ప్రాజెక్ట్ విలువలో 50 శాతం రాయితీ అందిస్తారు. అనుభవం ఉన్న వ్యక్తిగత పశుపోషకులు, రైతు ఉత్పాదక సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, జాయింట్ లయబిలిటీ గ్రూపులు, సెక్షన్–8 కంపెనీల నుంచి అర్హత ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.

లబ్ధిదారుల ఎంపిక ఇలా..

- లబ్ధిదారులు సంబంధిత ప్రాజెక్ట్‌లో శిక్షణ పొంది ఉండాలి. ప్రాజెక్ట్ నిర్వహణపై అవగాహన అవసరం.
- రాయితీ పోనూ మిగిలిన యూనిట్ విలువను బ్యాంక్ రుణంగా పొందడానికి అవసరమైన పత్రాలను సమర్పించాలి. బ్యాంక్ అనుమతి తప్పనిసరి.
- మార్గదర్శకాల ప్రకారం ప్రాజెక్ట్ నివేదిక తయారు చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.

సద్వినియోగం చేసుకోండి



జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ పథకంపై గ్రామీణ యువతకు, ఔత్సాహిక రైతులు, గొర్రెలు, మేకల కాపరులకు రైతు సేవా కేంద్రాల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఆన్‌లైన్‌లో నమోదు చేయడం గురించి రైతులకు తెలియజేస్తున్నాం. వీలైనన్ని ఎక్కువ యూనిట్లు నెలకొల్పి పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తులు పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ వీర భద్రయ్య, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు, ధర్మవరం

సబ్సిడీ విడుదల ఇలా..

- 50 శాతం సబ్సిడీ రెండు దఫాలుగా విడుదల చేస్తారు.
- బ్యాంక్ మొదటి దశ రుణం లబ్ధిదారులకు అందిందనే విషయాన్ని ధ్రువీకరించుకున్న తరువాత మాత్రమే మొదటి దఫా సబ్సిడీ మొత్తాన్ని సంబంధిత బ్యాంకుకు జమ చేస్తారు. ఆ సబ్సిడీని లబ్ధిదారుల ఖాతాలో ఆ బ్యాంక్ జమ చేస్తుంది.
- ప్రాజెక్ట్ మొత్తం పూర్తయిన తరువాత అధికారులు ధ్రువీకరించుకుని రెండో దఫా సబ్సిడీకి కూడా లబ్ధిదారులను అర్హులుగా పరిగణిస్తారు.

- సొంత లేదా కౌలు భూమిలో మాత్రమే ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలి. వీటిని రాష్ట్ర స్థాయి కమిటీ పరిశీలిస్తుంది. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న వారిని ఎంపిక చేసి జాతీయ లైవ్‌స్టాక్ మిషన్‌కు పంపిస్తారు.

క్లుప్తంగా

మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించండి



ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు వినతిపత్రం ఇస్తున్న మీటర్ రీడర్లు

ధర్మవరం రూరల్: మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రతను కల్పించడంతో పాటు ఎస్కో అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలని మీటర్ రీడర్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ సభ్యులతో కలిసి ఆయన అనంతపురంలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శివరాంకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్మార్ట్ మీటర్లు బిగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోయే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రతను కల్పించి ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బీసీ దస్తగిరి, ఉపాధ్యక్షులు బి.రామాంజి, జగదీష్, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఏఈని నియమించాలి

కనగానపల్లి: విద్యుత్‌శాఖ మండల అసిస్టెంట్ ఇంజినీరు (ఏఈ)ను వెంటనే నియమించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి మహదేవ అధికారులను కోరారు. సోమవారం స్థానిక రైతులతో కలసి జిల్లా కేంద్రంలో కలెక్టర్ చేతన్‌కు కలసి వినతిపత్రం అందజేశారు. మండలంలో 33 గ్రామాలకు పైగా ఉండగా.. చాలామంది రైతులు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత యేడాది కాలంగా మండలంలో రెగ్యులర్ ఏఈ లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. వెంటనే ఏఈని నియమించి విద్యుత్ సమస్యలను తీర్చాలని డిమాండ్ చేశారు.

మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

ధర్మవరం రూరల్: మాదక ద్రవ్యాల జోలికి వెళ్లి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కేహెచ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.ప్రభాకర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. సోమవారం కేహెచ్ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి బి.గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో సమాజంలో మాదక ద్రవ్యాల నిర్మూలన, దుర్వినియోగం, అక్రమ రవాణా, అసాంఘిక కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న పరిణామాలను గ్రహించాలన్నారు. మంచి అలవాట్లను నేర్చుకోవాలన్నారు. దేశంలో అక్షరాస్యత రేటు పెరుగుతున్న కొద్దీ దారుణాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. విలువలతో కూడిన విద్యను నేర్చుకుని మంచి పౌరులుగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం షమీవుల్లా, ఆనంద్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



మహిళా రైతుకు విత్తనాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని గువ్వలగొందిపల్లి గ్రామంలో సోమవారం టింబక్టు కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సంస్థ రాయలసీమ వాటర్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సంస్థ భూముల సంరక్షణకు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. రామగిరి, చెన్నేకొత్తపల్లి, రొద్దం మండలాల్లోని పలు గ్రామాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో వాటర్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ రవి, సన్నప్పయ్య, రవి, నారాయణస్వామి, గ్రామ సంఘం లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి



ఐక్యత చాటుతున్న ఉపాధ్యాయులు

ఎన్‌పీకుంట: ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. అనంతరం హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సర్వీస్ మొత్తం ఉద్యోగులు దాచుకున్న డబ్బు నుంచి పీఎఫ్ లోన్లు, ఏపీజీఎల్‌ఐ లోన్లు, ఫైనల్ పేమెంట్స్, ఆర్జిత సెలవుల నగదు చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కౌన్సిలర్ రమణానాయక్, మురళి, శివయ్య, గోవర్ధన్‌రెడ్డి, సందీప్, రహీం, వెంకటరామిరెడ్డి, రామ్మోహన్, లాలూసాబ్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

మానసిక రుగ్మతల నుంచి కోలుకోవాలి



భవిత పాఠశాలలో విద్యార్థులకు ఆటవస్తువులు పంపిణీ చేస్తున్న జడ్జి రాకేష్

పుట్టపర్తి/పుట్టపర్తి రూరల్: మానసిక రుగ్మతల నుంచి బుద్ధిమాంద్యం పిల్లలు త్వరగా కోలకోవాలని పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి కె.రాజేష్ పిలుపునిచ్చారు. సోమవారం పుట్టపర్తిలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలోని భవిత పాఠశాలలను ఆయన సందర్శించారు. బుద్ధిమాంద్యపు పిల్లలతో ముచ్చటించారు. రూ.40 వేలు విలువ చేసే పెన్నులు, పుస్తకాలు, ఇతర స్టేషనరీ వస్తువులను వారికి అందజేశారు. బుదద్ధిమాంద్యపు పిల్లలకు బోధించే ఉపాధ్యాయులను అభినందిసస్తూ వారికి చీరలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జన్యు లోపాలు వారి మానసిక ఎదుగుదలకు అవరోధంగా ఉన్నా, అభ్యసనం ద్వారా వారిలో పరివర్తన తీసుకురావడానికి దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కోర్టు సూపరింటెండెంట్ బాలాజీ నాయక్, క్రిమినల్ క్లర్క్ మంజునాథ్ ,సివిల్ క్లర్క్ అశ్వర్థనారాయణ, కోర్టు కానిస్టేబుళ్లు హరినాథ్,పెద్దారెడ్డి, రామాంజనేయులు,చంద్రానాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ఎనుములపల్లి ఉన్నత పాఠశాలలో ఉన్న భవిత కేంద్రాన్ని జడ్జి సందర్శించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు రమేష్, పద్మజారాణి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని నిరసన



గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, ప్రభుత్వ పాఠశాలల ఆయాలు

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై కూర్చుని పచ్చిగడ్డి తింటూ నిరసన తెలిపారు. సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో-కన్వీనర్లు అయూబ్ ఖాన్, ఆదినారాయణ మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రతి కార్మికురాలికి కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కార్యదర్శి నాగవేణి, కోశాధికారి లక్ష్మి, కమిటీ సభ్యులు వరలక్ష్మి, అంజనమ్మ, వెంకటలక్ష్మి, ఫరియాణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు పింఛన్ల పంపిణీ

బత్తలపల్లి: సామాజిక భద్రత పింఛన్లను మంగళవారం నుంచి రెండు రోజులు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సాయిమనోహర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో 6,306 మంది పింఛన్ లబ్ధిదారులకు అక్టోబర్ నెలకు పింఛన్ సొమ్ము అందజేయడం జరుగుతుందన్నారు. పింఛన్ల కోసం ప్రభుత్వం రూ.2,75,88,500 మంజూరు చేసినట్లు వెల్లడించారు. గ్రామ కార్యదర్శులు సోమవారం బ్యాంకుల డబ్బు డ్రా చేసినట్లు వివరించారు.

బదిలీ అధికారులకు సన్మానం

నల్లచెరువు: మండలంలో విధులు నిర్వహించి మరో ప్రాంతానికి బదిలీ అయిన అధికారులకు ఎంపీపీ రమణారెడ్డి, సర్పంచ్ పంచరత్నమ్మ, ఎంపీటీసీ లక్ష్మిదేవి సోమవారం సన్మానించారు. తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శకుంతల, పంచాయతీ కార్యదర్శులు రమణప్పనాయుడు, నాగేశ్వర్‌రెడ్డి, దివ్య లను పూలమాలలు శాలువాలతో సన్మానించారు.

నారాయణ స్వామిపై చర్యలు తీసుకోండి

ధర్మవరం రూరల్: గరుడంపల్లిలో సర్వే నెంబర్ 593–10లో 4.45 ఎకరాల అసైన్డ్ భూమిలో పేద రైతులు షెడ్లు వేసుకుని చాలా సంవత్సరాలుగా ఉన్నారని రైతు సంఘం నాయకులు జంగాలపల్లి పెద్దన్న తెలిపారు. సదరు భూమి తన పేరుపై ఉందంటూ సాకే నారాయణ స్వామి అనే వ్యక్తి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పేర్కొన్నారు. సోమవారం ఈ విషయమై బాధిత రైతులతో కలిసి ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. విచారణ చేసి న్యాయం చేయాలని ఆర్డీఓను కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మారుతి, రైతులు చంద్రాయుడు, మురళి, నరసింహులు, బాల పెద్దన్న, కుమార్, పద్మావతి, పోతులయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎన్‌పీకుంట ఎస్‌ఐగా వలీబాషా

ఎన్‌పీకుంట: ఎన్‌పీకుంట నూతన ఎస్‌ఐగా వలిబాషా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

నల్లచెరువు ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

నల్లచెరువు: నూతన ఎస్‌ఐ మక్బూల్ బాషా సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు.

ముదిగుబ్బ డీటీగా నారాయణ స్వామి

ముదిగుబ్బ: ముదిగుబ్బ డిప్యూటీ తహసీల్దార్ (డీటీ)గా జి.నారాయణ స్వామి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఈయన కదిరి ఆర్డీఓ కార్యాలయంలో విధులను నిర్వర్తించారు. బదిలీపై ముదిగుబ్బ మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా డీటీకి కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా బాబురావు బాధ్యతల స్వీకరణ

గాండ్లపెంట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా డి.బాబురావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీటీగా పనిచేసిన రవిని రామగిరికి బదిలీ చేశారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలు దుర్వినియోగం చేయొద్దు

బత్తలపల్లి: ఎస్సీ, ఎస్టీలు అన్యాయానికి గురైతే పోలీసులను ఆశ్రయించాలి. అనవసరంగా ఎస్సీ, ఎస్టీ చట్టాలను దుర్వినియోగం చేయవద్దని ఎస్‌ఐ శ్రీనివాసులు, ఎంపీడీఓ సాయిమనోహర్ అన్నారు. సోమవారం మండలంలోని మాల్యవంతం ఎస్సీ కాలనీలో ప్రాథమిక హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. పెత్తందార్లు వెట్టి చాకిరి చేయించడం, దౌర్జన్యాలు చేస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

తనకల్లు: చీకటిమానిపల్లి ఎస్సీ కాలనీలో సోమవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ శోభ సువర్ణమ్మ, ఎస్‌ఐ గోపీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికీ హక్కులతో పాటు బాధ్యతలను అందించిందన్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నం ఎస్సీ కాలనీలో ఎస్‌ఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ దినోత్సవం నిర్వహించారు. వీఆర్‌ఓ లక్ష్మీనారాయణరెడ్డి, సర్వేయర్ దనుంజయ్ తదితరులు సివిల్ రైట్స్ గురించి వివరించారు.

తాడిమర్రి: ఆత్మకూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎస్‌ఐ నాగస్వామితో కలిసి ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామ్‌రావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలపై అగ్రవర్ణాల వారు దాడులు చేసినా కులం పేరుతో దూషించి అవమానపరిచినా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేస్తామన్నారు.

ముదిగుబ్బ: ముదిగుబ్బలోని ఎస్సీ కాలనీ, అలాగే ఎనుములవారిపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో హక్కులు, చట్టాలపై ముదిగుబ్బ ఇన్‌చార్జ్ సీఐ శ్యామ్‌రావు అవగాహన కల్పించారు.

మండలాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ రాము

ఎన్‌పీకుంట: మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమష్టిగా కృషి చేద్దామని ఎంపీపీ ఈటె రాము పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రత్యేక అధికారి సురేంద్ర, ఎంపీడీఓ మనోహర్‌బాబు ఆధ్వర్యంలో వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 కార్యక్రమంపై మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. 2047 విజన్ అభివృద్ధి కోసం విద్య, నైపుణ్యం, సామాజిక సంక్షేమం, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కల్పన, రోడ్ కనెక్టివిటి, ఆర్థికాభివృద్ధి, వ్యవసాయం, ఆహారశుద్ధి, ప్రకృతి వ్యవసాయం, పర్యాటక రంగాలపై వ్యూహాత్మక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం గ్రామాల అభివృద్ధికి సంబంధిత శాఖల అధికారులు రూపొందించిన ఆక్షన్ ప్లాన్‌లను సమావేశంలో చదివి వినిపించారు. కార్యక్రమంలో ఏపీఓ చంద్రశేఖర్, పశు వైద్యాధికారి డాక్టర్ బాలానాయక్, ఎంఈఓ గోపాల్‌నాయక్, ఏపీఎం రమణప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జయమ్మ, వీఏఏ ఇంతియాజ్, ఎంపీటీసీ సరస్వతమ్మ, నాయకులు గోవింద్‌నాయక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా



రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చిస్తున్న డీఆర్‌ఓ కొండయ్య

ప్రశాంతి నిలయం: స్పెషల్ సమ్మరీ రివిజన్ –2025 కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాలో తప్పుల సవరణ చేసి దోషరహిత ఓటరు జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో దోషరహిత ఓటరు జాబితా రుపకల్పనపై చర్చించేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, కొత్తగా ఓటరు నమోదు కోసం ఇంటింటా సర్వే నిర్వహిసస్తామన్నారు.1500 పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను విభజించి నూతన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి వారి దృష్టికి వచ్చిన దరఖాస్తులు పరిశీలించి పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్ల కుంట అంజి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గౌస్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ , బీజేపీ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

అంకిత భావంతోనే గుర్తింపు



సాకే నాగరాజును అభినందిస్తున్న జేసీ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ కొండయ్య

ప్రశాంతి నిలయం: విధి నిర్వహణలో ప్రజలకు అంకిత భావంతో సేవలందించినప్పుడే గుర్తింపు లభిస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ భవనంలో కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన సాకే నాగరాజును జేసీ ఆధ్వర్యంలో సత్కరించారు. డీఆర్ కొండయ్య, ఆంధ్రప్రదేశ్ స్టేట్ రెవెన్యూ అసోషియేషన్ నాయకులు మైనుద్దీన్, మధునాయక్, సాయి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి



విద్యార్థిని షిఫాఖానంకు సర్టిఫికెట్ అందిస్తున్న డీఈఓ మీనాక్షి

గాండ్లపెంట: ఉమ్మడి అనంతపురం జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర–2047 వ్యాస రచన పోటీల్లో జెడ్పీహెచ్‌ఎస్ పదోతరగతి విద్యార్థిని షిఫాఖానం ప్రథమ బహుమతి సాధించింది. ఈమెను సత్యసాయి జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షి సర్టిఫికెట్ అందించారు. హెచ్‌ఎం సిద్దారెడ్డితో పాటు ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి



జేసీ అభిషేక్ కుమార్‌కు సమస్యలు విన్నవిస్తున్న నాయకులు

బత్తలపల్లి: మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు, రైతు సంఘం నాయకులు కోరారు. సోమవారం పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అడపాల వేమనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం మహదేవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య తదితరులు మాట్లాడారు. మండల కేంద్రంలో అంత్యక్రియలు నిర్వహించడానికి స్థలం లేదన్నారు. ఆర్డీఓ, తహసీల్దార్‌లను కలిసి విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదని పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఇష్టానుసారంగా సిమెంట్ రోడ్లు నిర్మించారన్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు, మురుగు నీరు ఇళ్ల మధ్యనే నిల్వ ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

అమడగూరు: మండలంలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పలు క్రీడల్లో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈఓ జిలాన్ బాషా, వ్యాయామ ఉపాధ్యాయుడు షబ్బీర్‌బాషా సోమవారం తెలిపారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో భాగంగా కొత్తచెరువులో నిర్వహించిన పోటీల్లో అండర్–17 కింద వాలీబాల్ నందు గౌతమ్‌సాయికుమార్, వెంకటేష్, కబడ్డీ బాలికల విభాగం నుంచి చందన, బాలుర నుంచి గౌతమ్ సాయి కుమార్, యోగా బాలికల విభాగంలో వైష్ణవి గెలుపొంది జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అలాగే అండర్–14 కబడ్డీలో జయంత్, పాజిల్, బాలికల విభాగం యోగాలో భూమి ఎంపికయ్యారన్నారు. కాగా ఎంపికైన విద్యార్థులను తోటి ఉపాధ్యాయ సిబ్బంది, తల్లితండ్రులు అభినందించారు.

ప్రత్యామ్నాయ విత్తనాలు తీసుకెళ్లండి



కందుల ప్యాకెట్ అందజేస్తున్న ఏఓ ముస్తఫా

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని ఏలుకుంట్ల, నేలకోట గ్రామాల్లో సోమవారం రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ముస్తఫా విత్తన పంపిణీ తీరును పరిశీలించారు. పెసలు, కందులు, ఉలవల స్టాకు వివరాలను తనిఖీ చేశారు. అర్హులైన రైతులందరికీ సజావుగా విత్తన ప్యాకెట్లను పంపిణీ చేయాలని రైతు సేవా కేంద్రం సిబ్బందికి సూచించారు. విత్తనాలను తీసుకున్న రైతులు తప్పనిసరిగా విత్తుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది నాగరాజు, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం ఆర్డీఓగా మహేష్



ధర్మవరం రూరల్: ధర్మవరం నూతన ఆర్డీఓగా ఎ.మహేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఇక్కడ పని చేస్తున్న ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి బదిలీపై వెళ్లారు. విజయవాడలో అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎ.మహేష్ బదిలీపై ధర్మవరం ఆర్డీఓగా వచ్చారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ మాట్లాడుతూ.. రెవెన్యూ డివిజన్‌లో ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఆర్డీఓకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బదిలీ ఉద్యోగికి సన్మానం

పుట్టపర్తి: బుక్కపట్నం మండల ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా మూడేళ్లుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీపై బత్తలపల్లికి వెళ్లిన శ్రీనివాసులును ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, బట్టల కేశప్ప, కార్యదర్శి వర్ష, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాలపై ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న ఐక్య విద్యార్థి సంఘం నాయకులు

ధర్మవరం రూరల్: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై నిజాలు నిగ్గు తేల్చాలి. పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘం జేఏసీ కన్వీనర్ పురుషోత్తం, కో–కన్వీనర్ పోతులయ్య డిమాండ్ చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు పాఠశాలలను సీజ్ చేయాలని కోరారు. విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని మండిపడ్డారు. పాఠ్య పుస్తకాలు, ఫీజుల పేరిట రూ.వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను వేధిస్తున్నారన్నారు. కనీస అర్హత లేని టీచర్లను నియమించుకుని పాఠశాలలను నడుపుతున్నారన్నారు. ప్రశ్నించిన విద్యార్థి సంఘం నాయకులపై ఆరోపణలు సరికాదన్నారు. పాఠశాల యాజమాన్యం బ్లాక్ మెయిల్ చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు నాగార్జున, బాలాజీ, హరి, నరేంద్ర, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.